క్లుప్తంగా

గుంత పూడ్చివేయించిన అధికారులు



గుంతను పూడ్చివేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: మండల కేంద్రంలోని 5వ వార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల కోసం గుంతను తవ్వి, పూడ్చకుండా వదిలేశారు. దీంతో 'గుంతను పూడ్చివేయరూ' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ కళ్యాణ్ చక్రవర్తి వార్డుకు వెళ్లి గుంతను పరిశీలించారు. వెంటనే సిబ్బందితో గుంతను పూడ్చి వేయించారు.

పరామర్శ

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన అడిగం నగేశ్‌ను తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పరామర్శించారు. ఆదివారం ఆస్పత్రికి చేరుకొని ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు.

మేరు సంఘం అధ్యక్షుడిగా రమేశ్



రమేశ్

తాంసి: మేరు సంఘం మండల అధ్యక్షుడిగా రామగిరి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఆదివారం తాంసి మండల కేంద్రంలోని ఆలయంలో నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమేశ్, కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా నారాయణను ఎన్నుకున్నారు. అనంతరం నియమాక పత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు జగదీష్, సంతోష్, రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఈ వారంతో 163వ వారినికి చేరింది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ట్రస్ట్ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. ఆమన్ పౌండేషన్ చైర్మన్ రఫత్ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సంగెం సుధీర్ కుమార్, మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, శేఖర్, అంబయ్య, రాజయ్య పాల్గొన్నారు.

తడిసిన జొన్నలు వాపస్

బోథ్: ఇటీవల కురిసిన వర్షానికి బోథ్ మార్కెట్‌యార్డులో పలువురి రైతుల జొన్నలు తడిసిపోయాయి. తడిచిన జొన్న పంటలో తేమ 12 శాతం కన్న ఎక్కువగా ఉండడంతో కొనేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు ముందుకు రావడం లేదు. బోథ్ మార్కెట్ నుంచి గోదాంలకు తరలిన పలువురి రైతుల జొన్నలను తిరిగి మార్కెట్‌కు పంపిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో తడిచిన జొన్నలను కొనాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

బుద్ధ జయంతి విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ విహార్‌లో ఈనెల 23న నిర్వహించే బుద్ధ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు బుక్టే విఠల్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్ధ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో బౌద్ధ ధమ్మ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోట్పోడే దయానంద్, మండల అధ్యక్షుడు దుండే సంతోష్, బాలేరావ్ రాందాస్, సింధే అనిల్, కాంబ్లే ఉత్తం, పవార్ అభినంద్, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ షురూ

- ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రారంభమైన ఆకు సేకరణ
- బేల రేంజ్ పరిధిలో 23 కల్లాలు



వడగూడలో సేకరించిన ఆకును కట్టలు కడుతున్న ఆదివాసీలు

బేల: అటవీశాఖ బేల రేంజ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు సేకరణ నాలుగు రోజుల నుంచి ప్రారంభం అయింది. రాష్ట్ర ప్రభుత్వం తునికాకు సేకరణ పథకం కింది అటవీశాఖ ఆధ్వర్యంలో ఏటా ఆకు సేకరణను వేసవిలో చేపడుతోంది. దీంతో వేసవిలో గిరిజనులు ఖాళీగా ఉండకుండా తునికాకు సేకరించి ఉపాధి పొందుతారు. ఇదిలా ఉండగా.. బేల రేంజ్ యూనిట్ కింద 23 కల్లాల పరిధిలో 12 లక్షల తునికాకు కట్టల సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ భూముల నుంచి సేకరించిన కట్టకు, పట్టా భూముల నుంచి సేకరించిన కట్టకు వేర్వేరు ధరలు ఉన్నప్పటికీ, స్థానికంగా ప్రభుత్వ భూముల్లోనే ఈ ఆకులు విరివిరిగా లభిస్తుంది. గతంలో ఈ ఒక్కో (యాభై ఆకుల)ఆకుల కట్టకు ధర రూ.2.05 ఉండేది. గతేడాది ప్రభుత్వం మరో రూ. 95 పైసలు పెంచడంతో ఒక కట్టకు ధర రూ. 3కు పెరిగింది. ఈసారి ప్రభుత్వం ధర పెంచకపోవడంతో గతేడాది నిర్ణయించిన ధర రూ.3 మాత్రమే కట్టకు లభించనుంది.

ఆకు సేకరణతో ఉపాధి..

బేల, జైనథ్, నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలో 23 కల్లాలను కేటాయించారు. ఇందులో అటవీకి సమీపాన ఆకు అధికంగా విరివిగా లభించే ప్రాంతాలైన కరోని, మశాల, నందిగూడ(బాది), తెలంగ్రావు గూడ, బోరిగాం, సోన్‌కాస్, దుబ్బగూడ (ఎం), జున్నపానీ, డౌన, ధర్మగూడ, సాంగ్వి(బి), పిప్రి, అడ్మియాన్, అర్జుని, దాబా, ఖండు, కుండి (గుండి), లోకారి(బి), లోకారి(కె), పర్స్‌వాడ, రాంపుర్, రోంఖాస్, ఖడ్కీ గ్రామాల శివారుల్లో ఆకు సేకరణ కల్లాలను ఏర్పాటు చేశారు. చిన్న కల్లంకు 25, పెద్ద కల్లంకు 55 మంది కూలీలు పని చేస్తూ.. ఉపాధి పొందుతున్నారు. తెల్లవారుజామునే ఆదివాసీలు అటవీ ప్రాంతానికి వెళ్లి, ఆకు సేకరిస్తున్నారు. తీసుకువచ్చిన ఆకుతో ఇంట్లో కట్టలు కడుతున్నారు. రోజుకు 150 పైబడి కట్టలు కడుతారు. ఆ కట్టలను కల్లంలో ఆరబెడుతారు. ఆకులు సేకరించిన వారికి రోజూ కూలీ రూ.400కు పైబడి లభిస్తుంది. ఆకు సేకరణ, కట్టలు కట్టడం, అరబెట్టడంలు 10 నుంచి 13రోజుల పాటు కొనసాగనుంది.

వివరాలు అందించాలి

బేల రేంజ్ యూనిట్ పరిధిలోని 23 కల్లాల్లో 12లక్షల ఆకు కట్టల సేకరణ లక్ష్యం నిర్ణయించబడింది. ఇప్పటికే తునికి ఆకు సేకరణపై గ్రామాల్లో ప్రచారం చేశాం. ఆకు సేకరించే వారు ఆధార్ కార్డు, ఫొటో, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలతో అటవీశాఖ బీట్ అధికారులను సంప్రదించాలి.

– సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి



నివాళులర్పిస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

నేరడిగొండ: మానవహక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని రోల్‌మామడ టోల్‌ప్లాజా సీఐటీయూ మండల అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, గోవన్ సింగ్‌లు అన్నారు. సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉండి పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేశ్, కార్మికులు శేఖర్, రాము, జాదవ్ మహేశ్, నరేందర్, రాంసింగ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న దత్తా నిక్కమ్

బేల: మండలంలోని జాతీయ రహదారి మార్గంలో దహెగాం గ్రామ క్రాస్ నుంచి జైనథ్ మండలంలోని కాప్రి గ్రామం వరకు రోడ్డు విస్తరణకు కేంద్రం ప్రభుత్వం రూ. 25కోట్లు నిధులు మంజూరు చేయడంపై బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నిధుల మంజూరికి ప్రత్యేక చొరవ తీసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, నిధులు కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీతోనే అన్నిరంగాల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఠాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, ఠాక్రే సందీప్, వాడయి వివేక్, ఇంద్రశేఖర్, రాము, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అర్చన, అభిషేకం, ఐదు జంటలతో హోమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో శ్రీభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని చేపట్టారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అర్లి(టి) ఉద్యోగుల సంఘం సభ్యులు వైకుంఠ అన్నదానం చేస్తున్న సభ్యులను సన్మానించారు. గ్రామపెద్దలు ఓమయ్య, నితిన్, సంతోష్ కుమార్, ఉల్లాస్ పటేల్ పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవతకు పూజలు



ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో మహాలక్ష్మీ గ్రామ దేవతకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుల్లతో గ్రామస్తులు ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేసి, మేకలు బలిచ్చారు. వంట చేసుకుని సామూహిక భోజనాలు చేశారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

ఆదర్శంగా మహనీయుల విగ్రహాలు



పొచ్చెర గ్రామంలో మహనీయుల విగ్రహాలు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్, ఉద్యమ నాయకుడు కుమురం భీం, ఛత్రపతి శివాజీ, వీరమాత చాకలి ఐలమ్మ వంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. చిన్న పిల్ల నుంచి పెద్దవాళ్ల వారి నుంచి స్ఫూర్తి పొందాలని ఒకేచోట ఏర్పాటు చేశారు. మహనీయుల అడుగుజాడల్లో తమ గ్రామం ముందుకు వెళ్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో గల టీచర్స్ కాలనీ, రిక్షాకాలనీ, సంజయ్‌నగర్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ, 33 కేవీ లైన్ మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు జొన్న కొనుగోళ్ల నిలిపివేత

తాంసి: మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో నేడు జొన్న కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సీఈవో కేశవ్ తెలిపారు. వర్షం పడే సూచన ఉండడంతో వాతావరణం సరిగ్గా లేనందున కొనుగోలును ఒక రోజు పాటు నిలిపివేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరూ జొన్నలను మార్కెట్‌కు తీసుకురావద్దని కోరారు. 21నుంచి యథావిధిగా జొన్న కొనుగోళ్లు చేపడుతామన్నారు.

గురుకుల సిబ్బందిని మార్చాలి



మాట్లాడుతున్న సయ్యద్ ఫయాజ్ హష్మి

ఎదులాపురం: విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని మైనార్టీ గురుకుల బాలుర2 పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే మార్చాలని ఇండియాన్ యూనియన్ ముస్లీం లీగ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఫయాజ్ హష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. అక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై డీఎండబ్ల్యూవోకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సిబ్బందిని మార్చాలని కోరారు.

గురుకులాల్లో స్పాట్ కౌన్సెలింగ్

ఇచ్చోడ: గిరిజన గురుకుల కళాశాల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇచ్చోడ గిరిజన బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఇంటర్‌లో చేరే బాలికలకు ఈనెల 23న, బాలురుకు ఈనెల 25న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలికలు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో, బాలురు లాల్‌టేకిడీ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

నేరడిగొండ: పదో తరగతి పాసైన విద్యార్థుల కోసం గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు టీటీడబ్ల్యూఆర్‌జేసీ బుగ్గారం పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో బాల, బాలికలు గురుకులంలో విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉందన్నారు. ఈనెల 23న బాలికలు, 25న బాలురు విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

- వరుణుడి కోసం ఎదురుచూపు
- మండలంలోని 34 జీపీల్లో 2.72 లక్షల పెంపకం

ఆదిలాబాద్‌రూరల్: గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందులో భాగంగానే ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను పెంచారు. ప్రస్తుతం మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీలలో నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు ప్రారంభమైతే జూన్, జూలై మాసంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వం, ఆయా గ్రామ పంచాయతీల అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సిద్ధంగా ఉన్న మొక్కలు..

వర్షకాలంలో మొక్కలను నాటేందుకు ముందస్తుగా అధికారులు మొక్కలను సిద్ధం చేశారు. మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామ పంచాయతీలోని ఒక్కొక్క నర్సరీలో 8 వేల చొప్పున మొత్తం 2.72 లక్షల మొక్కలను పెంచారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా బోర్లు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు ఎండకు ఎండిపోకుండా గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. అలాగే అందులో పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పకప్పుడు తొలగిస్తున్నారు.

వివిధ రకాల మొక్కలు..

ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో పండ్ల, పూల, అటవీ మొక్కలను పెంచుతున్నారు. అందులో భాగంగానే జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, ఖర్జురా, బాదం, వంటి పండ్ల మొక్కలతో పాటు గులాబీ, మల్లె, మందరం పూల మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు రోడ్లకు ఇరువైపులా నాటేందుకు టేకోమ, ఫీడ్లోఫాం వంటి మొక్కలు అందుబాటులో ఉన్నాయి. గతంతో పోల్చితే ప్రజలు ఇష్టపడే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

వర్షాలు ప్రారంభం కాగానే..



మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో నర్సరీలు ఉన్నాయి. అందులో ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాం. అన్ని నర్సరీలలో ప్రస్తుతం మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం.

– జాకీర్ హుస్సేన్, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్

సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుడ్ మార్నింగ్ నేరడిగొండలో భాగంగా ఆదివారం ఉదయం 3 కిలో మీటర్లు కాలినకన మండలంలోని ఇస్పూర్ (పెద్దగొండ్ గూడ) గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న వంతెనతో పాటు రహదారిని పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వంతెనకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ జాదవ్ రమేశ్, గంగాసింగ్, సవాయిరాం పాల్గొన్నారు.

వంతెన పనులు పూర్తి చేయాలి

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి గ్రామ సమీపంలో వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. ఇచ్చోడ, సొనాల ఆర్ అండ్‌బీ రోడ్డులో కొలారి వద్ద రూ.2కోట్ల నిధులతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తునందున రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అనంతరం చందునాయక్‌తండా గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు హాజరై విజేత జట్టుకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పడ్వల్ కవీందర్, డుబ్బుల చంద్రశేఖర్, చిల్కూరి భూమన్న, కానిండే రాజారాం, సాయి చైతన్య, అంగ నడ్పిరాజేశ్వర్, కిశోర్, పత్తుసింగ్, బాలాజీ, తిరుమల గౌడ్, పాల్వే మారుతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో సెల్ఫీ



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో సెల్ఫీ దిగుతున్న గ్రామస్తులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గుడ్ మార్నింగ్ నేరడిగొండలో భాగంగా ఆదివారం మండలంలోని ఇస్పూర్ (పెద్దగొండ్ గూడ) గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేతో గ్రామస్తులు, మహిళలు సరదాగా సెల్ఫీలు దిగుతూ కనిపించారు.

తడకల పందిరే 'అంగన్‌వాడీ'



బోథ్ మండలంలోని జైనూర్‌పల్లె గ్రామంలో తడకల పందిరిలోనే మినీ అంగన్‌వాడీని కొనసాగిస్తున్నారు. చుట్టూ తడకలు, పైకప్పు రేకులతో నిర్మించిన పందిరికి మినీ అంగన్ వాడీ కేంద్రం అని బోర్డు తగిలించారు. దీంతో పౌష్టికాహారం కోసం వచ్చిన చిన్నారులకు, గర్భిణులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. – బోథ్